
ప్రజాశక్తి

శనివారం 15 మార్చి 2025

5

అల్లూరి సీతారామరాజు



బోయ/వాల్మీకులను ఆదివాసీ జాబితాలో చేర్చొద్దు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:బోయ/వాల్మీకులను ఆదివాసీ జాబితాలో చేర్చొద్దని ఆదివాసీ గిరిజన సంఘం కార్యదర్శి కుర్ర నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ, తెలంగాణ బిజెపి ఎంపి డికె అరుణ బోయవాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చాలని వ్యాఖ్యానించడం సరికాదని తీవ్రంగా ఖండించారు.ఎస్టీ జాబితాలో చేర్చి ఆదివాసీలకు అన్యాయం చేయవద్దన్నారు. బోయవాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు.ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి నరసయ్య మాట్లాడుతూ, రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష షెడ్యూల్ ఏరియాలో గిరిజనేతరులకు ఇల్లులు మంజూరు చేయాలని పేర్కొనడం సరికాదన్నారు. 1/70 చట్టం ఉండగా షెడ్యూల్ ప్రాంతంలో గిరిజ నేతరులకు ఇల్లులు ఎలా మంజూరు చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు వి సూరిబాబు, కె.నగేష్, కె,నారాయణ పాల్గొన్నారు.



డోలీలో గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

గిరిజనులకు తప్పని డోలీ కష్టాలు

ప్రజాశక్తి -అనంతగిరి:డోలి మోత రహిత ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా తీర్చిదిద్దుతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మండలంలోని పినకోట పంచాయితీలో 2024 డిసెంబర్ 22న పర్యటించి రాచకీలం, గుమ్మంతి, దాయార్తి గ్రామాల బీటీ రింగ్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్డు పనులు చేపట్టక పోవడంతో రోగులకు డోలి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి.

మండలంలోని పిన్నకోట పంచాయతీ రాచకిలం గ్రామానికి చెందిన సూకురు. దేముడమ్మకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు గుమ్మంతి మట్టి రోడ్డు వరకు డోలి సహాయంతో కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడి నుంచి 108 అంబులెన్స్ లో గర్భిణి దేముడమ్మను కె కోటపాడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇది ఇలా ఉండగా రాసకిలం గ్రామం నుండి రెడ్డి పాడు వరకు సుమారు 5 కోట్ల పైగా బీటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఫారెస్ట్ అధికారుల అభ్యంతరంతో అనుమతులు లేవని రోడ్డు పనులు నేటి వరకు మొదలు కాలేదని గిరిజనులు తెలిపారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై నిరసన

-కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే ప్యాకేజీ పేరిట డ్రామాలు

-కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే ఊరుకోం : సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు:విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, ప్రైవేటీకరణ ఆపాలని, సెయిల్ విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు పాడేరులో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, గత కొంతకాలంగా స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలని పెద్ద ఎత్తున కార్మిక వర్గం ఉద్యమిస్తుంటే మరోపక్క కేంద్ర ప్రభుత్వం చాప కింద నీరులా ప్రైవేటుకరణకు పూనుకుంటుందని విమర్శించారు.కూటమి ప్రభుత్వం ఒత్తిడితో కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ కు ప్యాకేజీ ఇచ్చిందని విజయోత్సవాలు జరుపుకున్నారని, ఆ ప్యాకేజీ డబ్బులు పాత బకాయిలు చెల్లించేందుకే ఖర్చు పెట్టాలని యాజమాన్యం తెలపడంతో ఉద్యోగస్తులు విస్మయం చెందారన్నారు. ఎటువంటి బకాయిలు లేకుండా కార్పొరేట్లకి స్టీల్ ప్లాంట్‌ను కారు చౌకగా కట్టపెట్టాలనే ఆలోచనతో బిజెపి ప్రభుత్వం ఉందన్నారు. ఈ విషయాన్ని అందరూ గమనించాలని తెలిపారు. అంతేకాకుండా నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించే ప్రయత్నం చేస్తుందని, పెద్ద ఎత్తున కార్మిక వర్గం ఉద్యమించడంతో యాజమాన్యం తాత్కాలికంగా వెనక్కి తగ్గిందని తెలిపారు. నేటికీ నాలుగు నెలలుగా ఉద్యోగస్తులకు వేతనాలు లేవని తెలిపారు. కావాలని కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కక్ష కట్టిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలు ముందు ఒక మాట తర్వాత ఒక మాట చెబుతుందని తెలిపారు. స్టీల్ ప్లాంట్ ను కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యావత్ కార్మిక వర్గం ఉద్యమిస్తుందని, అందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు రాజు, అప్పలనాయుడు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన చేపడుతున్న సిఐటియు నాయకులు



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పూరిల్లు

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-ఎటపాక

మండలంలో తోటపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకుల ఇల్లు దగ్ధమైంది. తోటపల్లి గ్రామానికి చెందిన కాటూరి నరసమ్మ, అతని కుమారుడు కాటూరి వెంకటేశ్వర్లు కుటుంబాలు ఒకే ఇంట్లో నివాసముంటున్నాయి. శుక్రవారం వెంకట్‌రెడ్డి పేట గ్రామంలో వెంకటేశ్వర స్వామి కళ్యాణం తిలకించేందుకు కాటూరి నరసమ్మ కుటుంబ సభ్యులు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో మంటలు చెలరేగి నిమిషాల్లో ఇల్లంతా కాలి బూడిదైంది. స్థానికులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఇంట్లో ఉన్న మంచం, టీవీ, బీరువా, దుస్తులు, వడ్లు, బియ్యం, బంగారం కాలిపోయాయి. రోజు కూలికి వెళ్లి వచ్చిన ఆదాయంతో బతకడం తప్ప తమకు మరో ఆసరా లేదని, అగ్ని ప్రమాదంలో సర్వసం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలామని బాధితులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నారు.

16న పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 16న ఉదయం 10 గంటలకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జికె.వీధి తహశీల్దారు రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అమరావతి నుండి ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి హాజరవుతారని పేర్కొన్నారు. లైంగిక నేరాల నుండి పిల్లల్ని రక్షించే ఈ చట్టం అమలు చేయడం గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల సామాజిక కార్యకర్తలు, మహిళా పోలీసులు, గ్రామ సచివాలయ కార్యదర్శులు, అంగన్వాడీ వర్కర్లు వంటి వారు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విశాఖ రోడ్డు ప్రమాదంలో కొత్తవీధి వ్యక్తి మృతి

- బతుకుతెరువుకు వెళ్లి మృత్యువు ఒడిలో చేరిన వైనం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

బతుకుతెరువు కోసం విశాఖపట్నంలో వలస వెళ్లిన మండలంలోని కొత్తవీధికి చెందిన వ్యక్తి శుక్రవారం అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... రాజవొమ్మంగి మండలం జడ్డంగి శివారు కొత్తవీధి గ్రామానికి చెందిన దోనాద్రి రాంబాబు (44) విశాఖపట్నం కూర్మన్నపాలెం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. రాంబాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాంబాబు ఉపాధి నిమిత్తం కొత్త కాలం క్రితం విశాఖపట్నం వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో రాంబాబు మృతి చెందడంతో ఆయన కుటుంబం దిక్కులేనిదైంది. రాంబాబు మృతితో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కొత్తవీధి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రాంబాబు మృతి పట్ల సొసైటీ మాజీ అధ్యక్షులు గణజాల తాతారావ్ సంతాపం, మృతుని కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.



రాంబాబు (ఫైల్ ఫొటో)

గిరిజన ఉద్యమ నేత శరభన్న మృతి

-సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు ఘన నివాళి -నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ / పెదబయలు / పాడేరు విలేకరులు

గిరిజన ఉద్యమనేత, సిపిఎం పెదబయలు మండల నాయకులు కె.శరభన్న అనారోగ్యానికి గురై విశాఖలోని కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతిచెందారు. ఆయన మృతికి సిపిఎం, సిఐటియు, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు సంతాపం తెలిపారు. శరభన్న మృతి విషయం తెలిసిన వెంటనే సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.చిన్నంనాయుడు, సిహెచ్.కోటిబాబు, జివి.రమణమూర్తి కెజిహెచ్‌కు వెళ్లారు. శరభన్న కుటుంబీకులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ పెదబయలు మండలంలో గిరిజన సంఘం నేతగా శరభన్న అనేక పోరాటాలు, ఆందోళనలు నిర్వహించారని, గిరిజన హక్కుల కోసం నిరంతరం పనిచేశారని తెలిపారు. ముఖ్యంగా పివిజిటిల సమస్యలపై ఉద్యమాలు చేశారన్నారు. సిపిఎం కార్యకర్తగా అకింతభావంతో ప్రజా శ్రేయస్సు కోసం తన తుదిశ్వాస వరకూ పనిచేశారన్నారు. ఆయన మృతి పార్టీకి, గిరిజన ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. శరభన్న మృతి పట్ల సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

శరభన్న ఉద్యమ ప్రస్థానమిదీ..

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం అడుగులుపుట్టు పంచాయతీ పరిధి వడ్డేపుట్టు గ్రామానికి చెందిన శరభన్న 15 ఏళ్లుగా ఆదివాసీల సమస్యలపై ఎన్నో పోరాటాలు నిర్వహించారు. సిపిఎం మండల కమిటీ సభ్యునిగా, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా, సిఐటియు మండల కార్యదర్శిగా పనిచేశారు. ఎన్ని ఆటుపోట్లు వచ్చినా తట్టుకుని గిరిజన సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరి గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, పివిటిజిలకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, రహదారులు నిర్మించాలని ఉద్యమాలు నడిపారు. కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతూ విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు.

నేడు అంత్యక్రియలు

శనివారం ఉదయం 11 గంటలకు శరభన్న స్వస్థలమైన అడుగులుపుట్టు పంచాయతీ పరిధి వడ్డేపుట్టు గ్రామంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబీకులు, సిపిఎం నాయకులు తెలిపారు

ఆదివాసీ ఉద్యమానికి తీరనిలోటు : సిపిఎం

శరభన్న మృతి గిరిజన ఉద్యమానికి తీరని లోటని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, పెదబయలు మండల కార్యదర్శి బొండా సన్నిబాబు అన్నారు. శరభన్న మృతి పట్ల సంతాపం తెలుపుతూ వారు శుక్రవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. శరభన్న చేసిన పోరాటాలు గిరిజనుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు.



మృతదేహానికి నివాళి అర్పిస్తున్న కె.లోకనాథం, ఇన్‌సెట్‌లో శరభన్న (ఫైల్‌ఫొటో)



రాజవొమ్మంగిలో రంగులు చల్లుకుంటున్న పిల్లలు

ఘనంగా హోలీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో హెూలీ పండుగ ఉత్సవాలను శుక్రవారం గిరిజన యువతి యువకులు ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా ఒకరికొకరు రంగులు పూసుకుంటూ, రంగు నీళ్లను పోస్తూ సందడిగా ఉత్సాహంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో చిన్నారులు యువతీ యువకులు రంగు నీళ్ళతో కేరింతల కొడుతూ ఆనందంగా పండగను జరుపుకున్నారు. కించమండ, అరకు, గుంటసీమ ప్రాంతంలో కూడా గిరి యువత ఘనంగా జరుపుకున్నారు.


చింతపల్లి : చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మిస్ వినిత దెంక్లే సిఐ వినోద్ బాబు, ఎస్సై వెంకటేశ్వరరావుతో కలిసి హెూలీని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు.సిఆర్పిఎఫ్ సిబ్బంది ఒకరికి ఒకరు రంగులు పూసుకున్నారు.

రాజవొమ్మంగి:రాజవొమ్మంగి మండలంలో శుక్రవారం హోలీ పండుగ ఘనంగా జరిగింది. హెూలీ నేపథ్యంలో శుక్రవారం సెలవు కావడంతో చిన్నారులు, విద్యార్థులు సందడి చేశారు. చిన్నా పెద్ద అన్న తేడా లేకుండా రంగుల నీళ్లు జల్లుకుంటూ, ఆనందోత్సవాల నడుమ కేరింతలు కొట్టారు. మరికొంత మంది స్వీట్లు పంచారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో హెూలీ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఉదయం నుంచి చిన్నారులు, విద్యార్థులు యువకులు కేరింతల కొడుతూ ఒకరికొకరు రంగులు పూసుకొని హెూలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సీలేరు పురవీధుల్లో పరుగులు తీస్తూ సందడి చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్లో సిఆర్పిఎఫ్ పోలీసులు పోలీస్ స్టేషన్ ఎదురుగా భోగి మంటలు వేసి హెూలీ వేడుకలు నిర్వహించారు. దారకొండ, దుప్పిలివాడ పంచాయతీల పరిధిలోనూ, ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లోనూ హెూలీ సంబరాలు ఘనంగా జరిగాయి.

పరీక్షలపై భయం వీడాలి : సిఐ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:పది పరీక్షలపై భయాన్ని వీడి ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని అరకు సీఐ హిమగిరి విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, బాలుర గిరిజన ఆశ్రమ, బాలికల పాఠశాలలను తనిఖీ చేసి ముచ్చటించారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై పరిశీలించిన ఆయన మాస్ కాపీయింగ్ కు తావులేకుండా చూడాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయా పాఠశాలల విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల స్థాయిలోనే ఉన్నత చదువులకు అస్కారంగా ఉంటుందని, పది పరీక్షలను నిర్భయంగా హాజరై మంచి ఫలితాలను సాధించాలన్నారు.



మాట్లాడుతున్న సిఐ హిమగిరి

ఘాట్ రోడ్డులో నిలిచిన బస్సు

కండిషన్ ఉన్న బస్సులు నడపాలని ప్రయాణికుల వేడుకోలు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం ధారకొండ ఘాట్ రోడ్డులో భద్రాచలం నుండి విశాఖపట్నం వెళ్తున్న బస్సు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో శుక్రవారం మధ్యాహ్నం నిలిచిపోయింది. భద్రాచలం నుండి సీలేరు మీదగా విశాఖపట్నం వెళ్లే అల్ట్రా డీలక్స్ బస్సు శుక్రవారం దారకొండ ఘాట్ రోడ్డు రెయిన్ గేజ్ వద్ద క్లచ్ ప్లేట్‌లో సాంకేతిక లోపాలు తలెత్తి ప్రధాన రహదారిలో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు మండుటెండలో గంటల తరబడి నిరీక్షణ చేయవలసిన పరిస్థితి నెలకొంది. ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. అనంతరం సీలేరు నుంచి నర్సీపట్నం వెళుతున్న బస్ సర్వీసులో కొంతమంది ప్రయాణికులను తరలించగా, భద్రాచలం చింతపల్లి మీదగా పాడేరు వెళ్తున్న మరో బస్సులో చింతపల్లి వెళ్లే ప్రయాణికులను తరలించారు. ఘాట్ రోడ్డులో సుదూర ప్రాంతాలకు వెళ్తున్న బస్ సర్వీసులు కండిషన్ కలిగినవి కాకపోవడంతో తరచూ మరమ్మతులుకు గురవుతున్నాయి. విశాఖ- సీలేరు, భద్రాచలం మార్గంలో తరచూ బస్సులు మరతమ్మతులకు గురై మార్గమధ్యలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా ఆర్టీసీ అధికారులు మాత్రం కండిషన్ కలిగిన బస్సులను ఈమార్గంలో నడపడం లేదు. అల్ట్రా డీలక్స్ పేరుతో అధిక చార్జీలు వసూలు చేస్తూ డొక్కు బస్సులు తిప్పడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ఘాట్ రోడ్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యాన్ని తీసుకెళ్ళే విధంగా కండిషన్ కలిగిన బస్సుల్ని తిప్పాలని వేడుకుంటున్నారు.



మరమ్మతులకు గురై నిలిచిపోయిన ఆల్ట్రా డీలక్స్ బస్సు ఇదే...

వైభవంగా సీతారామచంద్రస్వామి వసంతోత్సవం

ప్రజాశక్తి-విఆర్.పురం

రెండో భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీరామగిరి శ్రీసీతారామచంద్ర స్వామి వారి వసంతోత్సవం ఆలయ కమిటీ చైర్మన్ పెందుర్తి సుదర్శన్ ఆధ్వర్యంలో శుక్రవారం కన్నుల పండుగగా జరిపించారు. పురాణాలను తలపించే విధంగా సీతరామచంద్ర స్వామి వారికి అభిషేకాలు చేసి పెళ్ళికొడుకుగా అలంకరించి గొలుసుల ఉయ్యాలలో ఉంచి స్వామివారికి జోల పాటలు పాడి భక్తిశ్రద్ధలతో మహెూత్సవం నిర్వహించారు. ఇప్పటినుంచి స్వామివారి కళ్యాణానికి కావలసిన ఏర్పాట్లు చేస్తారు. ఆలయ కమిటీ చైర్మన్ పెందుర్తి సుదర్శన్ మాట్లాడుతూ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపిస్తామని, భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తామని, శబరి గోదావరి నది ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు బోట్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పెద్దలు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మావోయిస్టులకు సహకరించొద్దు

ప్రజాశక్తి- అల్లూరి డెస్క్ : మావోయిస్టులకు గిరిజనులెవరూ సహకరించవద్దని డొంకరాయి ఎస్ఐ శివకుమార్ అన్నారు. వై.రామవరం మండలం బచ్చులూరు గ్రామంలో శుక్రవారం ఎస్ఐ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఉన్న కొంతమంది మావోయిస్టులు ఏఓబి ప్రాంతంలో తిరుగుతున్నట్లు సమాచారం వచ్చినందున గ్రామ ప్రజలు గుర్తు తెలియని వ్యక్తులకు, మావోయిస్టులకు ఆశ్రమం కల్పించవద్దని, సహకారం అందించవద్దని హితవుపలికారు. మావోయిస్టుల వల్ల వినాశనకర పరిస్థితులే తప్ప అభివద్ధి ఉండదని చెప్పారు. చుట్టుపక్కల అడవి ప్రాంతంలో అనుమానంగా తిరుగుతున్న వ్యక్తులు గురించి పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్డకండి గ్రామపంచాయతీ సర్పంచ్ వేమా సంధ్యారాణి, ట్రైనింగ్ ఎస్సై ఆరిఫ్, హెడ్ కానిస్టేబుల్ మోహిద్దిన్, కానిస్టేబుల్ గంగరాజులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము, సీలేరు

రేఖా నెం. 04/2025 **టెండరు మరియు బహిరంగ వేలం ప్రకటన** **తేదీ.13-03-2025**

అల్లూరి సీతారామరాజు జిల్లా, జి.కె.వీధి మండలం, సీలేరు గ్రామపంచాయితీకి చెందిన ఆదివారం వారపు సంత 2025-26 ఆర్థిక సంవత్సరమునకు అనగా తే:01-04-2025ది నుండి తే: 31-03-2026ది వరకూ బహిరంగ వేలం నిర్వహణ మరియు టెండర్లు స్వీకరణ ఈ దిగువ 1,2 షెడ్యూళ్ళు నందు వివరించబడిన వివరములు ప్రకారము జరుపబడును. షెడ్యూల్ 1 నందలి వివరములు ప్రకారం సప్లయినకు ధరావత్తులు చెల్లించి టెండరు దాఖలు చేయుటకు టెండర్లు తే: 20-03-2025ది గురువారం ఉదయం గం. 11.00లు నుండి మధ్యాహ్నం గం. 1.00 వరకూ స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం గం. 2.00లుకు హాజరైన టెండరుదారుల సమక్షమున తెరువబడును. షెడ్యూలు 2 నందలి వివరము గల బహిరంగ వేలము తే: 28-03-2023ది గురురం మధ్యాహ్నం గం.3.00లు నుండి ఈ దిగువ సంతకముదారునిచే జి.కె.వీధి మండలం, శ్రీ విస్తరణాధికారి (పి.ఆర్ అండ్ ఆర్.డి.) వారి సమక్షమున నిర్వహించబడును. బహిరంగ వేలము పాటలో పాల్గొనువారు షెడ్యూలు 2 నందు చూపబడిన ఆదివారం వారపు సంతనకు ధరావత్తులు చెల్లించి సాల్వెన్సీ ధృవపత్రము దాఖలుపర్చవలెను.

షెడ్యూలు-1 తే: 20-03-2025ది ఉదయం గం. 11.00 నుండి మధ్యాహ్నం గం. 1.00 వరకు

వ. నెం.	సప్లయి వివరములు 2025-2026 (తే:01-04-2025ది నుండి తే: 31-03-2026ది వరకు) సం.నకు	ధరావత్తు రూ.లలో
1.	సీలేరు గ్రామపంచాయితీ ఏరియాలో ప్రజారోగ్య పారిశుధ్య పనులకూ గానూ నిర్వహణకు అవసరమగు లేబర్‌ను సరఫరా చేయుటకు మనిషి 1కి నెల 1కిరేటు	1,000/-
2.	సీలేరు గ్రామపంచాయితీ పరిధిలో గల మంచినీటి స్కీములు మరియు వీధి కుళాయి పనులు నిర్వహణకు అవసరమగు లేబర్‌ను సరఫరా చేయుటకు మనిషి1కి నెల1కి రేటు	500/-
3.	సీలేరు గ్రామపంచాయితీ పరిధిలో గల విద్యుత్ వీధి లైట్లు నిర్వహణ పనులకు అవసరమగు లేబర్‌ను సరఫరా చేయుటకు మనిషికి 1కి నెల 1కి రేటు	500/-
4.	సీలేరు గ్రామపంచాయితీ పరిధిలో ప్రజారోగ్య పారిశుధ్య పనుల నిర్వహణకు అవసరమగు మందులు, బ్లీచింగ్ పౌడర్, పొడిసున్నం, ఫినాయిల్ వగైరాలను మరియు నిర్వహణ సామాగ్రి సరఫరా చేయుటకు	1000/-

షెడ్యూలు-2 తే: 20-03-2025ది మధ్యాహ్నం గం. 3.00లు నుండి

వ. నెం	బహిరంగ వేలం పాట వివరములు	ధరావతు రూ.లలో
1.	ఆదివారం సీలేరు వారపు సంతలో ఆశీలు వసూలు చేసుకునే హక్కు (2025-2026 (తే:01-04-2025ది నుండి తే:31-03-2026ది వరకు సం.నకు	2000/-

షెడ్యూలు 2 నందు బహిరంగ వేలంపాటకు సాల్వెన్సీ ధృవపత్రము శ్రీ తహశీల్దార్ వారిచే తే: 01-01-2025ది తదుపరి జారీ చేయబడునది అయి వుండవలెను.

నియమ, నిబంధనలు (1). షెడ్యూలు 1 నందు టెండర్లు, షెడ్యూలు 2 నందలి బహిరంగ వేలము సంబంధిత మిగిలిన షరతులు ఇతర వివరములు కార్యాలయము పనివేళల యందు తెలుసుకొనవలెను. టెండర్ల స్వీకరణ మరియు బహిరంగ వేలము వాయిదా వేయు అధికారము ఈక్రింది సంతకముదారునికి కలదు. టెండర్లు మరియు బహిరంగ వేలము గ్రామ పంచాయితీ వారి అనుమతి పొందిన తదుపరి ఖాయపర్చబడును. (2) షెడ్యూలు 2 నందు బహిరంగ వేలములో పాల్గొని, హెచ్చుపాటదారుడు పాట పాడిన పిదప ధరావత్తు మినహా పాట సొమ్ము మొత్తము గ్రామపంచాయితీ కార్యాలయములో చెల్లించి తగు రశీదు పొందిన తదుపరి మాత్రమే అశీలు వసూలు చేసుకొనవలెను. (3) షెడ్యూలు 1 నందలి గల 01 నుండి 03 వరకూ గల పనులకు సదరు పనులలో ప్రావీణ్యం గల వారిని మాత్రమే వినియోగించకొనగలవారమనియు సదరు పనులను పంచాయితీ కార్యదర్శి వారి పర్యవేక్షణలో పంచాయితీ కార్యదర్శి వారి సూచనల మేరకు నిర్వహించవలసి యుండునని మరియు అందుకు చెల్లించవలసిన లేబర్ పేమెంట్లును శ్రీ జిల్లా కలెక్టరు (పం.వి.) పాడేరు వారి అనుమతులకు లోబడి గ్రామపంచాయితీ నగదు నిల్వలుననుసరించి సి.ఎఫ్.యం.ఎస్.బిల్లు ద్వారా ఆమోదిత కాంట్రాక్టర్లు యొక్క బ్యాంక్ అకౌంటు నందు జమ చేయబడును. (4) ప్రకృతి వైపరీత్యములకు గాని మరి ఏ ఇతర నష్టములకు గాని, గ్రామపంచాయితీ వారికి ఎటువంటి సంబంధము లేదు. పూర్తి బాధ్యత గుత్తేదారే వహించవలెను. (5) నిబంధనల మేరకు స్టాంపు డ్యూటీ చెల్లించి అగ్రిమెంటు వ్రాసి ఈ కార్యాలయమునకు సమర్పించవలెను. (6) వరుస నెంబరు 4 టెండరు దాఖలు చేయువారు TAN మరియు G.S.T ఖాతాదారులు మాత్రమే టెండరును దాఖలు చేయవలెను.

సం/- వి.పరశురాముడు, పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ - సీలేరు

మహిళాభ్యున్నతికి పెద్దపీట

టిడిపి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మహిళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తెలిపారు. శుక్రవారం కుమ్మరిపుట్టులోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని రంగాల్లో మహిళా సాధికారత టిడిపి హయాంలోనే ప్రారంభమైందని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళల రక్షణ కోసం కొత్తగా శక్తి యాప్ అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. మే నెలలో ఇంటిలో ఎంతమంది చదువుకునే బిడ్డలుంటే అంతమందికి తల్లికి వందనం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతోందన్నారు. పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతరకు కూటమి ప్రభుత్వం నుండి రూ.కోటి నిధులు వచ్చేలా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుతో కలసి సిఎం చంద్రబాబును కోరుతామన్నారు. బడ్జెట్‌లో మహిళలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.

క్షతగాత్రునికి సిపిఎం నేతల పరామర్శ



పరామర్శిస్తున్న సిపిఎం నేత

ప్రజాశక్తి-అరకులోయ: మిరియాల చెట్టు నుంచి జారిపడి గాయాలపాలైన అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అరకులోయ మండలం బస్కి పంచాయతీ దేవరపల్లి గ్రామానికి చెందిన కిల్లో లలిత్ కాఫీ రైతుకి సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు ఆస్పత్రిలో పరామర్శించారు. మిరియాలు సేకరిస్తూ కాళ్ళు జారి చెట్టు నుండి కిందకి పడిపోవడంతో తలకి ఛాతికి బలమైన దెబ్బలు తగిలాయి. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ,ఏజెన్సీలో అనేకమంది మిరియాలు సేకరిస్తూ పడిపోయి కాళ్ళు, చేతులు విరిగిపోయిన పరిస్థితులు ఉన్నాయని, కుటుంబ యజమాని కుంటివాడైతే కుటుంబ పరిస్థితి దీనంగా ఉంటుందన్నారు. ఏజెన్సీలో ప్రధాన పంట కాఫీ ,మిర్యాల పండిస్తూ జీవిస్తున్న గిరిజన కుటుంబాలకు ఎటువంటి భరోసా లేకుండా పోయిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఆర్గానిక్ పంటకు అనేక లాభాలు ప్రభుత్వానికి వస్తున్నప్పటికీ కాఫీ, మిర్యాల రైతులకు ఇన్సూరెన్స్ వంటి పథకాలు లేకపోవడంతో ప్రమాదాలు సంభవించినప్పుడు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరుకు వారపు సంతలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని జాతీయ రహదారిలో శుక్రవారం ప్రమాదం జరిగింది. కితలంగి పంచాయతీ దూడుగుడ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అరకులోయ నుంచి డుంబ్రిగుడ వస్తుండగా, పాడేరు నుంచి అరకు వస్తున్న వాహనం, బైక్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో బైకులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

జోరుగా.. సిపిఎం ప్రజా చైతన్యయాత్రలు

● ఊరూరా సమస్యలను విన్నవిస్తున్న గిరిజనులు



పాడేరులో సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: గసభ పంచాయతీ జోడిగూడ గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సిపిఎం మండల నాయకుడు పి సురేష్ కుమార్ విమర్శించారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం ఆ గ్రామంలో సిపిఎం నాయకులు సందర్శించి పరిశీలించారు.బోర్ వెల్ పరిశీలించిన సిపిఎం నాయకులు మాట్లాడుతూ- మండలంలోని అనేక గ్రామాల్లో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని, గ్రావిటీ పథకాలు, బోర్ వెల్ మరమ్మత్తులకు గురైందని చెప్పారు. వేసవి కాలం సమీపిస్తున్నా మండల అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంతో తాగు నీరు అందక గిరిజనులు అల్లాడుతున్నారన్నారు. బోర్ వెల్ మరమ్మత్తుకు మండల పరిషత్ నిధులు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా వేసిన బోర్లు మూలన పడ్డాయని చెప్పారు. ఈ విషయంపై అధికారులకు పిర్యాదు చేసినప్పటికీ చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డుమెంబర్ పి సత్యనారాయణ, గోపాల్, కొర్రా భీమన్న పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: సిపిఎం ప్రజా చైతన్య యాత్రను మండలంలోని లక్ష్మీపురం పంచాయితీ జబద గ్రామంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, లక్ష్మీపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ కొర్రా త్రినాథ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా జబద గ్రామంలో ఇంటి ఇంటికి వెళ్లి ఆదివాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ, పీఎం జన్ మన్ పివిటిజిల గృహాల లబ్దిదారులకు రూ.10 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జబద గ్రామంలో రోడ్డు మంజూరు చేసి నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 9 నెలలు పూర్తి పూర్తవుతున్నప్పటికీ కొత్త పింఛను మంజూరు చేయడంలో వైఫల్యం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు టి.గోపాల్, కె.గురు, ఎస్. సోద, దొంబ్రు, మోహన్, బలరాం ప్రజలు పాల్గొన్నారు.

చింతపల్లి: ప్రభుత్వాల విధానాలతో గిరిజన నిరుద్యోగ సమస్య పెరుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా చింతపల్లి మండలం డైలీనగర్‌లో ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్య, సాగు భూమికి పట్టాలు ఇవ్వలేదని గిరిజనులు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, అల్లూరి జిల్లాలో ప్రతి గ్రామంలో 10వ తరగతి ఆపైన చదివిన గిరిజనులు ఒక్కొక్క గ్రామంలో 20 మందికి పైనే ఉన్నారని తెలిపారు. జిల్లాలో నిరుద్యోగ సమస్య పెరుగుతుందన్నారు. జీవో 3 రద్దు చేసిన తర్వాత మరింత ఈ సమస్య తీవ్రతరం అవుతుందన్నారు. నిరుద్యోగ యువత ఉపాధి లేక ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు వలస వెళ్లిపోతున్నారని వాపోయారు. ఈ సమస్యలపై ఈనెల 25వ తేదీన అన్ని మండల తహసిల్దార్ కార్యాలయం ముందు మహాధర్నాలు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మల్లు బాబు, చైతన్య, రమేష్ పాల్గొన్నారు.

పాడేరు: మండలంలోని చింతల వీధి పంచాయితీ నడిం వీధి గ్రామానికి చెందిన అర్హులైన గిరిజనులందరికీ ఇళ్ల స్థలాలు, పోడు పట్టాలు, తాగునీరు, రహదారి వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిపిఎం జిల్లా నాయకులు లింగేరి సుందరరావు డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పాడేరు మండలం చింతల వీధి పంచాయతీ సచివాలయం ముందు ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు కావస్తున్నా అభివృద్ధి కార్యక్రమాలు ఈ గ్రామంలో చేపట్టలేదని తెలిపారు.రహదారి సౌకర్యం, అటవీ హక్కుల పట్టాలు, నూతన రేషన్ కార్డులు, అంత్యోదయ కార్డులను వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు డి.బజ్జన్న గ్రామస్తులు సతీష్, రమణ, చిన్నబాబు, సోమన్న, అంతృ, బొంజుబాబు నాగరాజు, కొండమ్మ, చిన్నమ్మలు, వసంత కుమారి,. కొండమ్మ, నడిం వీధి గ్రామస్తులు పాలొగొన్నారు.



ముంచంగిపుట్టులో ప్రజాచైతన్యయాత్రలో సిపిఎం నేతలు



డుంబ్రిగుడలో బోరును పరిశీలిస్తున్న నాయకులు

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో మారుమూల బొంగరం పంచాయతీ పరిధి మొట్టల గుమ్మి లో రోడ్డు నిర్మాణ పనులను అరకు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ దొన్ను దొర శుక్రవారం శంకు స్థాపన చేశారు. గిరిజన ప్రాంతంలో ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు.అనంతరం దొన్నుదొర మాట్లాడుతూ, పల్లెలకు రోడ్డు నిర్మించాలని ఉద్దేశంతో ఉపముఖ్యమంత్రి ఇదివరకే శంకుస్థాపన చేశారన్నారు. ప్రతి గ్రామానికి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉడు లక్మిపాతి, ఎంపిటిసి, వన్సర్భ మచే కొండబాబు, ఎంపీపీ బొండా వరహాలమ్మ, ఎంపిటిసి కిమంకరి బొంజుబాబు, మాజీ ఎంపీపీ వి.కొండయ్య, ఎంపిటిసి పూర్శకరి భాస్కరరావు, సాగర పంచాయతీ సర్పంచ్ కొర్ర సీతారాం, పిఎసిఎస్ మాజీ చైర్మన్ కొమ్ములు నాయుడు పాల్గొన్నారు.

ప్రతి సోమవారమూ 'మీ కోసం'

ప్రజాశక్తి-జి.మాడుగుల : జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు మీ కోసం (పిజిఆర్ఎస్) కార్యక్రమం మండల కేంద్రంలో ప్రతి సోమవారం ఎంపిడిఓ కార్యాలయ మీటింగు హాలులో నిర్వహించబడుతుందని స్థానిక డిప్యూటీ తహసిల్దార్ గిడ్డి రాజ్ కుమార్ శుక్రవారం స్థానిక విలేకరులకు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీ సోమవారం జరిగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరించడం జరుగుతుందన్నారు. మండలలోని అన్ని గ్రామాల ప్రజలు సమస్యలపై అర్జీలను అందజేయాలని సూచించారు. వినతుల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు

టెన్త్ విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కస్తూర్బా, ఎపి బాలికల గురుకులం టెన్త్ విద్యార్థినులకు శుక్రవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు హైదరాబాద్ ఇన్సూరెన్స్ కంపెనీ చీఫ్ అడ్వయి ర్ జరాజాపు సురేష్‌కుమార్ పాల్గొని, పరీక్షలకు ఎలా సిద్ధమ వ్వాలి, ఆరోగ్య పరంగా ఏమేమి జాగ్రత్తలు తీసుకోవాలి, అంశాలపై వివరిం చారు. ప్రిన్సిపల్ గంగా కుమారి, జయప్రకాష్ పాల్గొన్నారు.

బావిలో పడి విద్యార్థి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

హెచ్‌ఎం, హాస్టల్ నిర్వాహకుడి నిర్లక్ష్యమే కారణం

మృతుని తల్లి ఆరోపణ

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల-2 లో ఆరవ తరగతి చదువుతున్న పాంగి యోసేపు చిలకల మామిడి పంట పొలాల వద్ద నీటి బావిలో స్నానానికి దిగి బురదల కూరుకుపోయి మృతి చెందిన ఘటన మండలంలోని చోటుచేసుకుంది. కుమారుడు మృతి విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, మేడూరు గ్రామస్తులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహం వద్ద ఆందోళన చేపట్టారు. వసతి గృహ నిర్వాహకుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడుల నిర్లక్ష్యం కారణంగా తన కుమారుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. విద్యార్థి కుటుంబానికి 30 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, తనకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని, వసతి గృహ నిర్వాహకుడు, ప్రధాన ఉపాధ్యాయుడును వెంటనే విధుల నుంచి తప్పించి సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, పాఠశాలలో నీరు సక్రమంగా లేక పోవడంతో స్నానాలకు విద్యార్థులు ఆరు బయట వెళ్లి ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహ నిర్వాకుడు, ప్రధాన ఉపాధ్యాయుడిని వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

స్థానిక సీఐ వినోద్ బాబు, ఎస్సై వెంకటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేపడుతున్న కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పాఠశాల నుంచి మృతదేహాన్ని ఆటోలో చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.



సమావేశమైన నాయకులు

భూములను దక్కించుకోవాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం బంగారం పేట గ్రామానికి చెందిన భూములు 70 శాతం గొలుగొండ మండలం కేడీ పేట గ్రామానికి చెందిన గిరిజనేతరుల చేతులలోకి పోయాయని, వాటిని తిరిగి దక్కించుకోవాలని ఆదివాసీ జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. బంగారంపేటలో జెఎసి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జెఎసి నాయకులు ఎస్.అశోక్ లాల్, పాడి లవరాజు మాట్లాడుతూ భూములను దక్కించుకునేందుకు ఆదివాసీలందరూ ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉల్లి సూరిబాబు, పాంగి రాజుబాబు, మాజీ ఎంపిటిసి పాంగి చిట్టిబాబు, అంతాడ సర్పంచ్ సుర్ల చంద్రరావు, మాదల సత్యనారాయణ, జగేల బాలరాజు, పీసా కమిటీ సభ్యులు సోమరాజు, కూడ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు జెడ్‌పి స్థాయీ సంఘాల సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం ఉదయం 10 గంటల నుంచి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరుగనున్నట్టు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు స్థాయీ సంఘాల సమావేశాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు 2వ, 5వ స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 11 గంటలకు 3, 4వ స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 12 గంటలకు 1, 6, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అధికారులందరూ తమ శాఖల ద్వారా అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల సమగ్ర ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

హెచ్‌ఎస్‌ఎల్ డైరెక్టర్‌గా కిరణ్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ కమర్షియల్)గా కిరణ్ ఈశంకరాల శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1997లో చార్టర్డ్ అకౌంటెంట్‌గా ఉత్తీర్ణత పొంది 1998లో ఆర్ఐఎన్ఎల్‌లో తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. అక్కడ కార్పొరేట్ ఖాతాలు, ట్రెజరీ, ప్రాజెక్ట్ ఫైనాన్స్, బడ్జెట్, అంతర్గత ఆడిట్ వంటి కీలక విభాగాలలో పనిచేయటంతో పాటు ఆర్ఐఎన్ఎల్ ఐపిఒ నిర్వహణలో పాలుపంచుకున్నారు. ఆర్ఐఎన్ఎల్, ఎంఒఐఎల్ మధ్య జాయింట్ వెంచర్ అయిన ఆర్ఐఎన్ఎంఒఐఎల్ ఫెర్రో అల్లాయ్స్ లిమిటెడ్ వ్యవస్థాపక చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఆయన ఉత్తమ పనితీరుకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక జవహర్ లాల్ నెహ్రూ అవార్డుతో పాటు ఆర్ఐఎన్ఎల్ నుంచి పలు పనితీరు సంబంధిత అవార్డులను అందుకున్నారు. హెచ్ఎస్ఎల్‌లో బాధ్యతలు చేపట్టడానికి ముందు కిరణ్ మార్చి 2024 నుంచి డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా పనిచేశారు. హెచ్ఎస్ఎల్‌లో డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ కమర్షియల్)గా ఆయన ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు.

జూ పార్కులో చిరుత మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో 20 ఏళ్ల వయస్సుగల సుధ (ఆడ చిరుత పులి) గురువారం రాత్రి మృతి చెందింది. ఈ విషయాన్ని జూ క్యూరేటర్ జి.మంగమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధాప్యంతో పాటు తీవ్రమైన మయోకార్డియల్ కారణంతో చిరుత మృతి చెందినట్టు పోస్టుమార్టం నివేదిక తెలియజేస్తోందని పేర్కొన్నారు. సుధను 2008 జనవరి 31న రుషికొండ రిజర్వు ఫారెస్ట్ నుంచి జూ పార్కుకు తీసుకువచ్చినట్టు తెలిపారు.

ఉష్ణోగ్రతల్లో వేగం

విశాఖలో రెండు రోజుల్లో 35 నుంచి 37 డిగ్రీలు

వేడి, ఉక్కపోతకు తోడు.. అక్కడక్కడా కరెంట్ కోతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎండా కాలం పూర్తిగా వచ్చేసినట్టే. తెలతెల్లవారుతూనే సూర్యతాపం క్రమంగా పెరుగుతోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్లపై జనం పలుచబడిపోతున్న పరిస్థితులు విశాఖ నగరంలో నెలకొన్నాయి. మార్చి సగంలోనే ఇలా ఉంటే మే నాటికి ఎండల తాపం ఎలా ఉంటుందోనన్న ఆందోళన ప్రజానీకంలో మొదలైంది. గడచిన రెండు రోజులుగా 35 నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు విశాఖలో నమోదయ్యాయి. ఈ ఏడాది క్రమంగా విశాఖ సహా పలుచోట్ల 45 డిగ్రీలు సెల్సియస్ దాటే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు వెల్లడిస్తున్నారు. రాయలసీమలోని అనంతపురంలో 40 డిగ్రీలకు దగ్గర్లో మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. పొడి వాతావరణం క్రమంగా పెరుగుతోందని విశాఖ, అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు శుక్రవారం సాయంత్రం నివేదించారు. నగరంలో 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రతలు రానున్న వారం రోజుల్లో పెరుగుతాయని ఆ నివేదిక సారాంశం. ఉత్తర, దక్షిణ కోస్తా అలాగే రాయలసీమలో పలుచోట్ల వేడి గాలులు, పొడి వాతావరణం ఏర్పడి ఉక్కపోత పరిస్థితులు ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది ఎండలు బాగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో అక్కడక్కడా వర్షాలు లేదంటే ద్రోణి, అల్పపీడన ద్రోణులు ఏర్పడితే తప్ప వాతావరణంలో చల్లదనం కనిపించే అవకాశాలు తక్కువన్నది తెలుస్తోంది.

కరెంట్ ఛార్జీల మోత మోగనుందా ?

ఓ పక్క మండే ఎండలు, మరోవైపు అక్కడక్కడా మొదలైన కరెంట్ కోతలు జనాన్ని ఇబ్బందులపాల్జేస్తున్నాయి. విద్యుత్ వినియోగం పెరగనున్న నేపథ్యంలో ఛార్జీల మోత మోగనుందని స్పష్టమవుతోంది. ఇప్పటికే ట్రూ అప్, అదనపు ఛార్జీల పేరుతో కొన్ని సంవత్సరాల క్రితం వాడిన కరెంట్‌కు ఇప్పుడు వినియోగదారులపై ఛార్జీల భారం పడుతోన్న సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం పెంచిన భారాలు జనం నెత్తిన పడనున్నాయి.



ఎండలోనే సాగుతున్న ప్రయాణాలు

పదేళ్ల తర్వాత కుటుంబం చెంతకు..



వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి నరసింహమూర్తి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2016లో హైదరాబాద్‌లో అదృశ్యమైన నిజామాబాద్ జిల్లాకు చెందిన శ్రీను (45)ను విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చొరవతో శుక్రవారం ఉదయం ఈస్ట్ ఎసిపి అన్నెపు నరసింహ మూర్తి, ఎంవిపి పోలీసులు, రెడ్ క్రాస్ సిబ్బంది సంయుక్తంగా అతని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎసిపి నరసింహమూర్తి ఆ వివరాలను వెల్లడించారు. ఈ నెల 11న మధ్యాహ్నం విశాఖపట్నం బీచ్ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి రోడ్డు పక్కన అచేతనంగా పడి ఉన్న వ్యక్తి కనిపించాడు. అతనికి ఆయన ఆహారం అందించడంతో పాటు ఎంవిపి పోలీసుల సహాయంతో పెద్ద వాల్తేర్‌లోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి హోం లెస్ షెల్టర్‌కు తరలించారు. అనంతరం అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. ఆ వ్యక్తి దగ్గర ఉన్న ఆధారాలతో తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా మద్నూర్ స్వగ్రామంలోని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు శుక్రవారం ఉదయం విశాఖ చేరుకొని అతనిని గుర్తించారు. శ్రీనుకు వివాహం జరిగిందని, ప్రస్తుతం 18 సంవత్సరాల కూతురు, భార్య ఉన్నారని వారు తెలిపారు. మీడియా సమావేశంలో రెడ్ క్రాస్ సభ్యులు మురళి, ఎంవిపి స్టేషన్ సిఐ ఎన్.మురళి, ఎస్ఐలు మహంతి శ్రీనివాస్, ధనుంజయ నాయుడు, షేక్ ఖాదర్ బాషా పాల్గొన్నారు.



గంగవరం నుంచి సభకు బయలుదేరిన నాయకులు

జనసేన ఆవిర్భావ సభకు తరలివెళ్లిన శ్రేణులు

ప్రజాశక్తి గంగవరం : కాకినాడ జిల్లా పిఠాపురంలో శుక్రవారం జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి హలో గంగవరం చలో పిఠాపురం పేరుతో పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. జనసేన పార్టీ మండల అధ్యక్షులు కుంజం సిద్దు ఆధ్వర్యంలో మండల కేంద్రం 500 మంది తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సీతామహాలక్ష్మి, గౌరాజు గణేష్, ఏసు, నాగు, చిన్నారెడ్డి, ఉపేంద్ర, కంగల శివ, వెంకన్న, రాజకుమార్ పాల్గొన్నారు.

కొయ్యూరు : జనసేన ఆవిర్భావ సభకు కొయ్యూరు మండలం నుండి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు 200 మంది కార్లు, బైకులు, వాహనాల్లో తరలివెళ్లారు. జనసేన మహిళల అధ్యక్షురాలు సెగ్గె భావన సాయి జయంతి జండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గూడెం లక్ష్మణ్, సాగిన బుజ్జిబాబు, శేషు, పీటా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరరావు మృతికి ఎంపిటిసి సంతాపం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చింతవానిపాలెం గ్రామానికి చెందిన 30 ఏళ్ల యువకుడు కూనిశెట్టి ఈశ్వరరావు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి చెందడంతో ఎంపిటిసి ఎంపీటీసీ కూనిశెట్టి మల్లికార్జునరావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దుచ్చరి చిట్టిబాబు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈశ్వరరావు సంవత్సర కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతున్నాడు. కొంతకాలంగా ఇంటి వద్దనే ఉన్న ఈశ్వరరావు శుక్రవారం ఉదయం మృతి చెందాడు. దీంతో కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న కుమారుడు మరణించడంతో తల్లి కాసులమ్మ చెల్లి విజయ, మేనత్త నూకాలమ్మ, బాబాయ్ సోమరాజు శోకసముద్రంలో మునిగారు. సర్వం అమ్ముకుని చికిత్స చేయించినప్పటికీ ప్రాణం దక్కలేదని వారు వాపోయారు. ఎంపిటిసితో పాటు అనేక గ్రామాల నుంచి బంధువులు వచ్చి సంతాపం తెలియజేశారు.

ముచ్చర్లలో బెల్ట్‌షాపులను తొలగించండి

ప్రజాశక్తి -ఆనందపురం : గుడి, బడి అనే తేడాలేకుండా గ్రామంలో ఇష్టారాజ్యంగా బెల్ట్‌షాపులను ఏర్పాటుచేసి, మద్యం అమ్మకాలు చేస్తున్నారని ముచ్చర్ల మహిళలు ఆవేదన చెందుతున్నారు. వెంటనే గ్రామంలోని మద్యం బెల్ట్‌షాపులను తొలగించే చర్యలు చేపట్టాలని వేడుకున్నారు. ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలతో గ్రామస్తులు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నామనివాపోతున్నారు. నీళ్లకుండీలు, శొంఠ్యాంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మందుబాటిళ్లను తీసుకొచ్చి, ముచ్చర్లలో మూడుచోట్ల బాహాటంగానే అమ్మకాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఏడాదికి రూ.3.30లక్షలను చెల్లించేలా ఒప్పందం జరగడంతో గ్రామంలోని రచ్చబండ, రామాలయం, పాఠశాల వద్ద మూడు చోట్ల బెల్ట్‌షాపులను ఏర్పాటు చేసి, ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ.50వరకు అధిక ధరకు అమ్ముతూ మందబాబుల జేబులు గుల్ల చేస్తున్నారని ఆంటున్నారు. గ్రామంలోనే విచ్చలవిడిగా మద్యం దొరుకుతుండడంతో మందుబాబుల ఆగడాలతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. దీనికితోడు గ్రామంలోని కోళ్లు, మేకలను దొంగతనాలు కూడా జరుగుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, ముచ్చర్లలోని మద్యం బెల్ట్‌దుకాణాలను తొలగించే చర్యలు చేపట్టాలని మహిళలు కోరుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.